# ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** స్వతంత్ర భారతదేశంలోనే అతిపెద్ద వ్యవసాయ రుణ మాఫీని, దేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ ఇవ్వలేనన్ని అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం, రైతులకు అత్యధిక సన్న బియ్యం బోనస్, 1947 నుంచి ఏ రాష్ట్రానికి సాధ్యం కాని అత్యధిక వరి ఉత్పత్తిని, చెరువుల పునరుద్ధరణ–40 ఏళ్ల తరువాత ఆక్రమణలు పూర్తిగా నిలిపివేత తదితర ప్రతిష్టాత్మక రికార్డులను తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు మొదటి సంవత్సరం పాలనలో సాధించారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం 50 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసీ నది పునరుద్ధరణకు ప్రాధాన్యతను, హైదరాబాదు వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేలా 50 ఏళ్ల భవిష్యత్తుకు తగ్గట్టుగా మౌలిక వసతుల రూపకల్పన చేపట్టింది. భారతదేశంలో మొదటి పరిశ్రమ ఆధారిత నైపుణ్య విశ్వవిద్యాలయ, దక్షిణ భారతదేశంలో అతిపెద్ద క్రీడల విశ్వవిద్యాలయం ఏర్పాటును చేపట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగానికి ఉచిత విద్యుత్ ద్వారా నెలకు దాదాపు రూ.10,000 ఆదా జరుగుతున్నది.

రైతులకు 24 గంటలూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించి 3,000లకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టింది. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహం, 200లకు పైగా ఎకరాల గాంధీ స్మారక నిర్మాణానికి చర్యలు చేపట్టింది. హైదరాబాద్ ప్రజల అవసరాల కోసం గోదావరి నుంచి తాగునీరు సరఫరా కోసం చర్యలు చేపట్టింది. భవిష్యత్ నగర ప్రణాళికలు సిద్ధం భారత్‌లోనే అత్యాధునిక నగరంగా హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌తో పాటు నాలుగో నగరంగా అభివృద్ధి చేస్తున్నది. రెసిడెన్షియల్ పాఠశాలల పిల్లల కోసం ఆహార, కాస్మెటిక్ బడ్జెట్లు పదేళ్ల తరువాత పెంపుదల చేసింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు, పారిశ్రామికవేత్తలకు రుణాలు లక్ష మంది మహిళా కోటీశ్వరులను సృష్టించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించింది. సమగ్ర కుల జనగణన విధానాలు, కేటాయింపుల సమీక్ష చేపట్టింది. దళిత, గిరిజన, బిసి, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రపంచస్థాయి రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి రూపకల్పన చేసింది. అవినీతితో కూడిన ధరణి పోర్టల్‌ను పూర్తిగా జాతీయ సంస్థ ఎన్‌ఐసికి అప్పగించి మార్పులు చేసింది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంఎల్‌లను కలుసుకునే అవకాశం కల్పించింది. మీడియా స్వేచ్ఛ పునరుద్ధరణ, విమర్శలను అణచివేసే ప్రయత్నాలు నిలిపివేత చర్యలు చేపట్టింది. భవిష్యత్ తరాలకు హానికరం కాకుండా మాదక ద్రవ్యాలపై పోరాటం చేపట్టింది. తొలి సంవత్సరంలోనే గరిష్టంగా పెట్టుబడుల ఆకర్షణ, విదేశీ, దేశీయ, ప్రజా పెట్టుబడులను ఆకర్షించింది. ప్రాంతీయ రింగ్ రోడ్, రింగ్ రైలు ప్రాజెక్టులు, మెట్రో రైలు విస్తరణ, తదుపరి దశ ప్రారంభమయ్యాయి. టైయర్2 పట్టణాల్లో పారిశ్రామికాభివృద్ధి, వరంగల్ రెండవ రాజధాని, భారీ అభివృద్ధి ప్రాజెక్టులు మొదలయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం కోసం 400,000 ఇళ్లకు ఆమోదించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి వ్యక్తికి రూ. 10లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్‌కేర్‌ను అందిస్తున్నది. ప్రజావాణిలో 5 లక్షల ప్రజా సమస్యల పరిష్కారం చేపట్టింది. ప్రతి నెల మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపు చేస్తున్నది.

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణకు సిద్ధమైంది. రాష్ట్ర స్వాభిమానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర స్ఫూర్తిని, గొప్పతనాన్ని, ప్రజల ఐక్యతను పునరుద్ఘాటించేలా రూపొందిన కొత్త 'తెలంగాణ గీతం' ఆవిష్కరించింది. తెలంగాణ రాష్ట్ర శోభకు, గౌరవానికి ప్రతీకగా టిజి అనే సంక్షిప్త రూపాన్ని చిహ్నంగా ఎంపిక చేసి రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ప్రత్యేకతను ప్రతిబింబిస్తుంది. ప్రతిరోజూ 18 గంటలు పని చేసే ముఖ్యమంత్రి, ప్రజల సమస్యలను వినే శ్రద్ధ, పరిపాలనలో మెరుగుల కోసం ఫీడ్ బ్యాక్ తీసుకునే వినమ్రత వల్ల తెలంగాణ ఇప్పుడు నిజమైన భవిష్యత్ రాష్ట్రంగా ఎదుగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.


(ఫైల్)

## వర్షాకాలంలోపు వరద ముంపు.. నివారణ పనులు పూర్తిచేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డు మార్గంలో లేక్‌వ్యూ అతిథి గృహం వద్ద వరద ముంపు నివారణ కోసం నిర్మిస్తున్న రెయిన్ వాటర్ సంప్ పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. భారీ వర్షాలు, వరదలు చిన్నపాటి వరదొచ్చినా నగరంలో చాలాచోట్ల రోడ్లు జలమయమై ట్రాఫిక్‌తో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు గుర్తించిన 141 వరదనీరు నిలిచే ప్రాంతాల వద్ద వెంట వెంటనే నీరు వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి గతంలో అధికారులను ఆదేశించారు. ఆ పనుల పురోగతిని సిఎం స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే వర్షాకాలం నాటికి అన్ని చోట్లా పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



రెయిన్ వాటర్ సంప్‌ల డిజైన్‌లో అవసరమైన మార్పులను అధికారులకు సూచించారు. ఈ పనుల పరిశీలన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎంఎల్‌ఎ దానం నాగేందర్, మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిశోర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) భాస్కర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

## 30 రోజుల్లో 18 ఎసిబి కేసులు

### 30 మంది ఉద్యోగులు అరెస్టు

బాధితులు '1064'కు కాల్ చేయండి : ఎసిబి డిజిపి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ మాసంలో చేసిన దాడుల్లో మొత్తం 18 కేసులు నమోదు చేసినట్లు ఎసిబి డిజిపి విజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో 17 కేసులు లంచం తీసుకుంటు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినవి కాగా మరో కేసు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఉన్నాయన్నారు. అరెస్టు చేసి, జ్యూడీషియల్ కస్టడీకి పంపిన 30మందిలో 27 మంది ప్రభుత్వ అధికారులు ఉండగా, మరో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారన్నారు. పంచాయతీ రాజ్, విద్య, పోలీసు, మున్సిపల్, టిజిఎస్‌పిడిసిఎల్, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి, కమర్షియల్ టాక్స్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్ వంటి వివిధ శాఖలలో లంచాలు తీసుకుంటు పట్టుబడిన కేసుల్లో రూ.3,54,000 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న నిలేష్ కుమార్‌కు చెందిన రూ.17,73,53,500 విలువగల ఆస్తులను సీజ్ చేశారన్నారు. నవంబర్ మాసంలో మూడు కేసుల్లో కోర్టులో నేరారోపణలు రుజువు కావడంతో వారికి శిక్షలు విధించబడ్డాయన్నారు. రాజేంద్రనగర్ జిహెచ్‌ఎంసి సీనియర్ అసిస్టెంట్ జిలగం వెంకటేశ్వరరావుకు ఏడాది, మంచిర్యాల సర్కిల్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ డి.వై.పోచయ్యకు మూడేళ్ళ, నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎఇ పి.అశోక్‌కు రెండేళ్ల కారాగార శిక్ష పడిందన్నారు.

**బాధితులు ఎసిబి హెల్ప్‌లైన్ నెంబర్ 1064**

ఏదైనా పబ్లిక్ సర్వెంట్ డిమాండ్ చేసినట్లయితే, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ACB టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని ఎసిబి డిజిపి విజయ్‌కుమార్ సూచించారు. అలాగే ఎక్స్‌లో (twitter@TelanganaACB)తో పాటు ఫేస్‌బుక్ Facebook (@telanganaacb) ప్లాటాఫారమ్‌లలో కూడా పోస్ట్ చేయాలని ఆయన ప్రజలకు అభ్యర్థించారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మాదగోని సత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మాదగోని సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాదగోని సత్యంకు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాదగోని సత్యం మాట్లాడుతూ ఆర్‌టిఐ కమిషనర్ కార్యాలయాల్లో వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్‌టిఐ కమిషనర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, యాదగిరి ముదిరాజ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల అంత్యక్రియల చార్జీల పెంపు

### రూ. 20వేల నుంచి రూ.30వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగి మరణించినప్పుడు ఇచ్చే అంత్యక్రియల ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు ఇస్తుండగా, దీనిని రూ.30వేలకు పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. మొదటి వేతన సవరణ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## పోలీసులతోనే రేవంత్ పాలన

### మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏడాది కాలంలో సిఎం రేవంత్ ప్రభుత్వ సత్తా ఏమిటో తెలిసిపోయిందని, ఆయన కేవలం పోలీసులతో పాలన చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్, బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలిసి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశామని, తమ విద్యార్థి విభాగం గురుకులాల్లో సమస్యలు అధ్యయనం చేస్తే సిఎం రేవంత్ రెడ్డికి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు.అసెంబ్లీ సమావేశాలు ఉన్న నేపథ్యంలోనే ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడానికే తమ బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏంచేశారని సంబురాలు జరుపుకుంటున్నదని ప్రశ్నించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు ఎక్కడా జరిగినా తప్పేనని, కెసిఆర్ హయంలో ఒక ఎన్ కౌంటర్ జరిగితే, పోలీసు ఉన్నతాధికారులను మందలించారని జగదీశ్ రెడ్డి వివరించారు. రేవంత్ పాలనలో జరిగిన ఎంకౌంటర్లలో 14 మంది చనిపోయారని,ఏ ఎన్‌కౌంటర్‌పైన ఆరోపణలు వచ్చినా వాటిపైన విచారణకు ఆదేశించాలని సూచించారు. వివిధ శాఖలకు మంత్రులు లేకపోవడం కూడా ప్రభుత్వ వైఫల్యాలకు ప్రధాన కారణమని, కీలకమైన విద్యాశాఖకు మంత్రి లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

## కెసిఆర్ మొక్క కాదు..వేగు చుక్క

### ఎంఎల్‌సి కవిత కితాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి కేసులను నమోదు చేస్తున్నదని, తమ కార్యకర్తలను వేధిస్తే ఊరుకోబోమని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కెసిఆర్‌ను సిఎం రేవంత్ రెడ్డి మొక్క అని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని, కెసిఆర్ మొక్క కాదని, ఒక వేగుచుక్క అని అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో కవిత సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో బిఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎంఎల్‌ఎ డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బ్రిటీష్ పాలనలో కూడా చేనేత రంగంపైన పన్ను లేదని, అలాంటిది ప్రధాని మోదీ జిఎస్‌టిని విధించడం దౌర్భాగ్యమన్నారు. ఈ సమావేశనంతరం అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు కందగట్ల స్వామి, బొల్లా శివశంకర్, గుంటక రూపక, గుర్రం శ్రవణ్ కవితను కలిశారు.



## కమిషన్‌కు వినతుల వెల్లువ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు ఏర్పాటు చేయబడినటువంటి ఏక సభ్య కమిషన్ ఈరోజు వినతులకు వెల్లువయ్యింది. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ ఆధ్వర్యంలోని ఏకసభ్య కమిషన్ హైదరాబాదులోని బూర్గుల రామకృష్ణారావు భవనంలో గత నెల 11 నుంచి క్రియాశీలకంగా పని చేస్తున్న విషయం తెలిసిందే. కమిషన్ ఏర్పాటు అయిన మొదలుగా షెడ్యూల్డ్ కులాలలోని 59 కులాలకు చెందినటువంటి వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు, నాయకులు, వ్యక్తులు కార్యాలయాన్ని ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంకాలం ఐదు గంటల వరకు కమిషన్ వారిని కలిసి తమ కులం, విద్య ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోవడంలో వెనుకబడిన విషయాన్ని విన్నవించుకుంటూ రాతపూర్వకమైనటువంటి విజ్ఞప్తులను క్రమం తప్పకుండా అందిస్తూ వస్తున్నారు. అయితే సోమవారం నాడు 10 షెడ్యూల్ కులాల్లోని మాల, మాదిగ కుల ప్రతినిధులతో పాటు, అల్పసంఖ్యాక కులాలయిన మాదాసి కురవ, కొలుపుల, మాల జంగమ, చిందు, బేడ,బుడగ జంగము, బైండ్ల, మాంగ్, అరుంధతీయ, మిత అయ్యల్వార్ మొదలగు వాటికి చెందినటువంటి దాదాపు 100 మందికి పైగా ప్రతినిధులు జస్టిస్ షమీం అక్తర్‌ని కలిసి, షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకై తమ అభిప్రాయాలను తెలియజేశారు. తమ తమ కులాల వెనుకబాటుతనాన్ని, విద్య మరియు ఉద్యోగాల సాధనలో రిజర్వేషన్ను పొంది లబ్ది పొందడంలో తమకు జరుగుతున్నటువంటి అన్యాయాన్ని తెలియజేస్తూ రాతపూర్వకమైన విజ్ఞప్తులను అందించారు. అలాగే షెడ్యూల్ కులాలలో భాగమైన తాము ప్రత్యేక వృత్తులు కలిగి ఉన్నామని తాము వేర్వేరు జీవన విధానాలను అవలంబిస్తున్నామని తెలియజేశారు.

## నూతన నియామకాల లోపే జెన్‌కోలో ఎఇ బదిలీలు చేపట్టాలి

### డిప్యూటీ సిఎం భట్టికి టిజిపిఇఎ వినతి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖలో ఎఈ ఉద్యోగ నియామకాలను చేపడుతున్న క్రమంలో టిజి జెన్‌కోలో ఎఈల బదిలీలను చేపట్టిన తరువాతే నూతన ఎఈల నియామక ప్రక్రియను చేపట్టాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కకు టిజిపిఇఎ విజ్ఞప్తి చేసింది. సోమవారం ఈ మేరకు తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ పి. సదానందంల నేతృత్వంలో సోమవారం సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కను కలిసి ఒక వినతిపత్రం అందజేస్తు టిజి జెన్‌కో సిఎండికి ఈమేరకు ఆదేశాలు ఇవ్వండని కోరారు. అసిస్టెంట్ ఇంజనీర్ల పరీక్షలు ఇటీవలే పూర్తి అయిన విషయాన్ని వారు డిప్యూటీ సిఎం భట్టి దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగుల బదిలీలు అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ క్రమంలో ప్రస్తుత ఎఇలకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. టిజిపిఇఎ వినతిపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ తప్పకుండా మీ వినతిని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైలు ప్రయాణికులకు సౌకర్యాలు

### సదుపాయాల పై దృష్టి సారించండి

### ద.మ రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్ ఆదేశం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన స్టేషన్ పునరాభివృద్ధి పనులు, భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సమీక్షించారు. ఈ మేరకు సోమవారం జోన్ వ్యాప్తంగా జరుగుతున్న పనులపై వివరణాత్మక సమీక్షా సమావేశాన్ని సికింద్రాబాద్ రైల్ నిలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ , వివిధ శాఖల ప్రధానాధిపతులతోపాటు 6 డివిజన్ల పరిధిలో సికింద్రాబాద్ , హైదరాబాద్ , విజయవాడ , గుంతకల్లు , గుంటూరు , నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి. ఆర్. ఏంలు ) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షాసమావేశంలో పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ జోన్ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ కింద చేపట్టిన స్టేషన్‌ల పునరాభివృద్ధికి సంబంధించిన పురోగతిపై సకాలంలో పూర్తి చేసేందు కోసం సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాబోయే 40 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కళ, సంస్కృతి, ముఖద్వారం, డిజైన్, స్టేషన్ అనుసంధానం, పార్కింగ్ ప్రాంతం, పికప్ , డ్రాపింగ్ సౌకర్యాలు, సూచిక బోర్డులు, దివ్యాంగుల సౌకర్యాలు, పాదాచారుల వంతెనలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, అధునాతన మరుగుదొడ్లు, పూర్తిస్థాయి సౌకర్యాలతో కూడిన వెయిటింగ్ హాల్స్ వాటిపై దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. చిన్న పిల్లలకు పాలు త్రాగించడానికి విశాలమైన బేబీ ఫీడింగ్ గదులు, వినోదం వాణిజ్యం కోసం స్థలాన్ని రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకుపూర్వం , జనరల్ మేనేజర్ రైలు కార్యకలాపాల భద్రతపై సమీక్షించారు. రైల్వే బోర్డు భద్రత మార్గదర్శకాలు జోన్‌లో ఖచ్చితంగా పాటించాల్సిన అవసరంపై ఆయన అధికారులకు సూచనలు చేశారు.

## ఉచితంగా ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా భాషా, తెలంగాణ సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ అఫ్ ఫోటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యములో ఉచితంగా 3 వ బ్యాచ్ ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని అకాడమీ ఛైర్మన్ ఎంసి శేఖర్ వెల్లడించారు.యువత ఫోటోగ్రఫీ నేర్చుకొని, ఉపాధికోసం వృత్తిగా స్వీకరించడానికి ఉత్సాహంగా ఉన్నట్లయితే, వారు ఈ సమగ్ర ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఆరు నెలల (అఫ్ లైన్ ,ఆన్ లైన్ ) ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు లో ప్రవేశానికి ఫోటోగ్రఫీ అభిరుచి గలవారు లేదా వృత్తిగా స్వీకరించేవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రాథమిక ఫోటోగ్రఫీ తోపాటు వెడ్డింగ్, ఇండస్ట్రియల్, ఫ్యాషన్, పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, అధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్ లలో కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందని, ఈ ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్స్ ఫోటోగ్రఫీ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో పట్టణ, గ్రామీణ యువతకు సహాయం చేయడమే కాకుండా ఫోటోగ్రాఫర్‌గా ఎదిగి, వృత్తిగా స్వీకరించేవారికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గత రెండు బ్యాచ్ లలో దాదాపు 600 మంది యువత విజయవంతంగా ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు అభ్యసిస్తున్నారని అన్నారు. ఈ 3 వ బ్యాచ్ ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు ఈ నెల 28 నుండి శిక్షణ తరగతులు ప్రారంభమౌతాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నంబర్లలో (8008021075 7095692175 )లలో ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని, అలాగే వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు https: //sapindia.org/didlomacourse/ లింక్ ద్వారా చేసుకోవాలని, దరఖాస్తులకు ఆఖరు తేదీ ఈ నెల 20న ముగుస్తుందని ఎంసి శేఖర్ వెల్లడించారు.

## జియోస్మార్ట్ ఇండియా 2024 ప్రారంభం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** భారతదేశంలో ప్రీమియర్ జియోస్పేషియల్ టెక్నాలజీ కాన్ఫరెన్స్ 'జియోస్మార్ట్ ఇండియా 2024' సదస్సు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్‌ఐసిసి)లో జరిగింది. అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పట్టణ వ్యవహారాలు, భూ నిర్వహణ, సివిల్ ఏవియేషన్ మంత్రి బాలో రాజా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సోమవారం ఈ సదస్సును ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్ నాలుగు రోజులు పాటు జరగనుంది. జియోస్పేషియల్ నాలెడ్జ్ ద్వారా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సమర్థంగా రూపుదిద్దడం అనే లక్ష్యంతో ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్ మంత్రి బాలోరాజా మాట్లాడుతూ అరుణాచల్ ప్రదేశ్‌ను అభివృద్ధి వైపు నడిపించడమే తమ లక్ష్యం అన్నారు.

## ఘనంగా అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం

* వంద మంది వైద్య విద్యార్థులకు పట్టాల అందజేత

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆర్ఎస్ఆర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఏఐజి హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. వంద మంది 2018 బ్యాచ్ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి, డీన్ డాక్టర్ కె మనోహర్, ఏఐఎంఎస్ఆర్ సీఓఓ అపర్ణా రెడ్డి హాజరయ్యారు. 2012లో ప్రారంభమైన అపోలో మెడికల్ కాలేజీలో ఇప్పటి వరకు 700 మందికి పైగా విద్యార్థులు పట్టభద్రులయ్యారు. వీరిలో 90 శాతానికి పైగా విద్యార్థులు ఈ దేశంలోని వివిధ వైద్య కళాశాలలలో, విదేశాలలో పీజీ సీట్లు సాధించారు. ప్రతిష్ఠాత్మక ఛైర్మన్ మెడల్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి బంగారు పతకంను ఉత్తమ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి సిద్దాంత్ బర్మేచాకు అందించారు. ఈ అవార్డు సీనియర్ ఫిజిషియన్ లేటు డాక్టర్ కేవీఆర్ ప్రసాద్ స్మారకార్థం ఏర్పాటు చేశారు.

# గంజాయి అమ్మితే ఆస్తులు జప్తు

### ''అపరేషన్ ధూల్‌పేట్''పై ఎక్సైజ్ శాఖ కీలక నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'చెపితే వినక పోతే.. చెడంగ చూడాలంటరు' ఇలాంటి పరిస్థితి నేడు ధూల్‌పేట్‌లో నెలకొంది. గంజాయి అమ్మకాలకు నెలవుగా మారిన ధూల్‌పేట్‌లో గంజాయిని పూర్తిగా నిర్మూలించాలని ''ఆపరేషన్ ధూల్పేట్'' చేపట్టారు. జూలై నుంచి మొదలైన గంజాయి దాడులు నేటికి కొనసాగుతున్నాయి. ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్సెమెంట్ నిత్యం అమ్మకాలపై నిఘా పెట్టడం, నిందితులను పట్టుకోవడం, కోర్టుల చుట్టు తిప్పిడం, గంజాయిని, వాహనాలను స్వాధీనం చేసుకవడం లాంటి ప్రత్యేక దాడులు,తనిఖీలు చేపట్టడంతో ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలకు పూర్తిగా స్థిరపడినట్లు అయింది. ధూల్‌పేట్‌లో క్వింటాళ్ల గంజాయి అమ్మకాల నుంచి కిలోల స్థాయికి గంజాయి అమ్మకాలు పడిపోయాయి.

గంజాయి అమ్మకాలను విడిచి చాలా మంది అమ్మకందార్లు హైదరాబాద్ శివారు ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. దీనికి కారణం దూల్‌పేట్ ఎక్సైజ్ శాఖ పోలీసులు, ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్ స్పెషల్ టీం రౌండ్ ద క్లాక్ తనిఖీలతో గంజాయి అమ్మకాలకు మూకుతాడు పడింది.

**గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు..**

ధూల్‌పేట్‌అపరేషన్లో భాగంగా దాదాపు నాలుగు నెలల నుంచి దాడులు కొనసాగుతున్నాయి. ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకందార్లు, రవాణ, వినియోగదారుల్లో గంజాయి అమ్మకాలను పూర్తిగా నిలిపి వేయించాలనే నిర్ణయంతో గంజాయి నిర్మూలన అవగాహన సదస్సు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో ఎక్సైజ్ ఉన్నతాధి కారులు గంజాయితో సంబంధం ఉన్న వారితో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు . గంజాయి అమ్మకాలు పూర్తిగా మానివేయాలని కోరారు. చాలావరకు ఉన్నతాధికారుల మాటల పట్ల విశ్వాసం ఉంచినట్లు కనిపించారు. కానీ గంజాయి అమ్మకాలు మళ్లీ చేపడితే మాత్రం 68 ఎఫ్/ఎన్‌డిపిఎస్ యాక్ట్ ద్వారా అస్తులు జప్తుకు దిగాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**ఆస్తులు..పిడి యాక్ట్‌పై దృష్టి...**

ధూల్‌పేట్‌లోఅవగాహన సదస్సు అనంతరం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అధికారులతో ధూల్‌పేట్ కేసులపై సమీక్ష నిర్వహించారు. దూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు పూర్తి కనుమరుగు కావడం ఒక శుభసూచకమైనా.. మళ్లీ ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలకు దిగితే కఠినంగా వ్యవహరించడంతో పాటు అస్తుల జప్తులు, పిడి యాక్ట్ అమలుకు దిగాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

**ధూల్‌పేట్ అపరేషన్లో ప్రగతి..**

అపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా ఇప్పటి వరకు 330 కేజీల గంజాయిని పట్టుకున్నారు. 4.2 కేజీల హ్యాష్ ఆయిల్, 38 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. 61 కేసుల్లో 218 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 40 మందని అరెస్టు చేశారు. 67 మంది పరారీలో ఉన్నారు. 141 మందిని బైండోవర్ చేయగా 15 మందిపై జరిమానా విధించారు. 128 కేసుల్లో చార్జి షీట్ వేశారు.





**గంజాయి అమ్మకాలు పూర్తిగా నిలిపి వేయాల్సిందే..కమలాసన్‌రెడ్డి**

ధూల్‌పేట్‌లో అందరు గంజాయి అమ్మకాలను నిలిపివేయాల్సిందేనని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. నాడు నాటుసారా తయారీ, అమ్మకాలను నిలిపి వేసినట్లు నేడు గంజాయి అమ్మకాలను కూడ పూర్తిగా నిలిపి వేయాలన్నారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ విషయంలో దృష్టి పెట్టిందని, గంజాయి, డ్రగ్స్ విషయంలో ఎవ్వరిని ఉపేక్షించే పరిస్థితులు లేవన్నారు. గంజాయి అమ్మకాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని, ధూల్‌పేట్ వాసులకు గంజాయి అమ్మకాలు పూర్తిగా నిలిపివేయడమే లక్ష్యంగా ఉండాలన్నారు.



## రాజ్‌భవన్‌లో ఉత్సాహంగా అసొం వ్యవస్థాపక దినోత్సవం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అసొం వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి సుధాదేవ్ వర్మతో పాటు రాష్ట్రంలో ఉంటున్న అసొం ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ సందర్భంగా అసొం వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇతర రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాలను పంచుకోవడం శుభపరిణామమన్నారు. మన బంధం మరింత దృఢంగా పెరగడానికి ఒకరి సంస్కృతులను మరొకరు నేర్చుకునేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కాగా రాజ్‌భవన్‌లో జరిగిన ఈ అసొం ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆ రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ వేడుకలలో సాంప్రదాయ నృత్యాలు, ప్రత్యేక ప్రదర్శనలు కూడా ప్రదర్శించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది, హైదరాబాద్‌లో స్థిరపడిన అసొంవాసులు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగులకు పరికరాల అందజేత

**ప్రజాపక్షం/కేశంపేట :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద దివ్యాంగులకు పరికరాలు, కిట్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నారు. కేశంపేట మండల కేంద్రానికి మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రానున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్ సోమవారం తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, ఎంఆర్ కిట్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వశాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్దిదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

# మహానగరి

## అనుమతుల్లేని క్రషర్లకు నోటీసులు

**ప్రజాపక్షం/నార్సింగి:** శంషాబాద్ మండలం పరిధిలో అనుమతిలేని క్రషర్లు, రెడీమిక్స్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ తహసీల్దార్ రవీంద్ర దత్తు హెచ్చరించారు. శంషాబాద్ మండల కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అనేక క్రషర్లు రెడీమిక్స్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయన్నారు. ఇటీవల వీటిపై స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు తమకు వచ్చాయని తెలిపారు. ఆయా ఫిర్యాదుల ఆధారంగా క్రషర్లు, రెడీమిక్స్‌ల యజమాన్యాలకు నోటీసులు జారీ చేశామని, వారం రోజులు గడువు లోపల అనుమతి ఉన్న పత్రాలు సమర్పించకపోతే క్రషర్లు, రెడీమిక్స్‌లల సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

### కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని వీరాంజనేయ కాలనీలో కమ్యూనిటీ హాల్, రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పనులు పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎఇ రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామయ్య, జనరల్ సెక్రటరీ సుధాకర్‌రావు, గంగాధరం, సుధాకర్, రహీం, భాష, శివ శంకరయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

### జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చంపాపేట:** విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిహెచ్‌ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా, లింగోజిగూడ డివిజన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8,9వ తరగతి విద్యార్థులతో కలిసి సోమవారం శాతవాహన కాలనీలో చేపడుతున్న సిసి రోడ్డు పనులపై విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డిసి సేవ ఇస్లావత్, ఇఇ కార్తీక్, డిఇ రవిచంద్ర, అధికారులు నగేష్ నాయక్, నాయకులు శ్రీధర్ గౌడ్, రాజేశ్వరీ, వసంత, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, విష్ణు, నరేశ్, వెంకట్, కాలనీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రార్థనా మందిరాల వద్ద సిసి కెమెరాలు

### షాద్‌నగర్ రూరల్ సిఐ నర్సయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గ్రామ దేవతల ఆలయాల వద్ద తప్పని సరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని షాద్‌నగర్ రూరల్ సిఐ నర్సయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీలు, మతాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో మందిరాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉంటాయన్నారు. సమావేశంలో ఎస్‌ఐ కృష్ణయ్య, మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, శ్రీలక్ష్మీ నర్సింహ్మస్వామి దేవాలయ చైర్మన్ చేవెళ్ల కృష్ణయ్య, వివిధ పార్టీల నాయకులు శుకూర్, కె.లక్ష్మ య్యగౌడ్, కె.శ్రీశైలం, బి.నర్సింలు, షర్ఫుద్దీన్, రషీద్, కె,నర్సింలు, వి.అంజనేయులు, వాసూరి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమదారులపై చర్యలు తీసుకోండి

### హయత్ నగర్ ఎంఆర్ఒకు కాలనీవాసులు వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్లోని వెంకటేశ్వర కాలనీ, సాహెబ్ నగర్ సర్వే నెంబర్ 71/1 ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాడానికి ప్రయత్నిస్తున్నారని వెంకటేశ్వర కాలనీ వాసులు సోమవారం హయత్ నగర్ మండల తహసీల్దార్ ఝాన్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు పి.కృష్ణ, నర్సింహ్మ మాట్లాడుతూ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు బిక్షమయ్య, మనోహరాచారి, నరసింహ, కృష్ణ, అంజయ్య, కోటేష్, గణేష్, రాజు, శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి ఆర్థికసాయం అందజేత




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** హాఫీజ్‌పేట్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే దివ్యాంగుడికి ఆరోగ్య చికిత్స కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ఆర్థిక సహాయం అందచేశారు. సోమవారం చందానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొంద విజయ్ కుమార్ రూ.10 వేల నగదును అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ ఆధ్వర్యంలో ఎందరికో సాయ సహకారాలు అందిస్తూ వస్తున్నామని, ముఖ్యంగా విద్యార్థులు చదువుకోడానికి సహాయ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమలో క్లబ్ అధ్యక్షుడు బి.మధుసూదన్ రెడ్డి, ప్రదాన కార్యదర్శి సింగరెడ్డి శాంతి భూషణ్ రెడ్డి, బర్కా మల్లేష్ యాదవ్, మారం ప్రసాద్, సింగదాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ముమ్మరంగా ప్రజావిజయోత్సవాలు

### నేడు రూ.5942 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్న సందర్భంగా 'ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా జిహెచ్‌ఎంసికి సంబంధించి రూ.5942 కోట్ల అంచనా వ్యయంతో పలు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల పనులకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. వీటన్నింటినీ హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు కింద చేపట్టనున్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు నిర్మించారు. అయినా పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలున్నాయి. అలాగే వానొస్తే నగరంలోని పలు ప్రాంతాలు చెరువులుగా మారుతున్నాయి. ఆ సమస్య పరిష్కారానికీ దాదాపు రూ.950 కోట్ల పనులు జరిగాయి. రెండవ దశలో చేపట్టాల్సిన పనులున్నాయి. వీటన్నింటినీ హైసిటీ కింద చేపట్టేందుకు శంకుస్థాపన చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన జూపార్కు – ఆరాంఘర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. ఆరు ఎస్‌టిపిలు, రూ.586 కోట్లతో ఎస్ఎన్‌డిపి పనుకు శంకుస్థాపన చేయనున్నారు.

### శంకుస్థాపన చేయనున్న పనులు..

> కెబిఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు పనులకు ప్రభుత్వం ఇప్పటికే రూ.826 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచే వీటిని విడుదల చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ పనులకు శంకుస్థాపనలు

> హైసిటీ ప్రాజెక్ట్ కింద రోడ్ల నిర్మాణ పనులు రూ.3,500 కోట్లు,

> వరద నీటి ముంపు నివారణకు సంపుల నిర్మాణాలకు రూ. 16.50 కోట్లు

> 283 సుందరీకరణ పనులు రూ. 150 కోట్లు

> ప్రతి సర్కిల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు స్క్రీనింగ్, హెల్త్ క్యాంపులు

> ప్రతి సర్కిల్ లో టుకే రన్, సాంస్కృతిక కార్యక్రమాలు

> కొన్ని సర్కిళ్లలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు

## జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 132 విజ్ఞప్తులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రధాన కార్యాలయం, ఆరు జోన్‌లలో మొత్తం 132 ఫిర్యాదులు అందాయి. ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా 6 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 38 విన్నపాలు రాగా ఇంజనీరింగ్ నిర్వహణకు, వెటర్నరి, ఎల్‌పిఓ 3 చొప్పున, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, యుబిడి, సిఇ ప్రాజెక్ట్ ఒకటి చెప్పున విన్నపాలు అందాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్‌లలో మొత్తం 94అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివకుమార్‌నాయుడు, నళిని పద్మావతి, గీతారాధిక, ఎస్.పంకజ, సిఎన్ రఘుప్రసాద్, సుభద్రదేవి, చంద్రకాంత్‌రెడ్డి, యాదగిరిరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, అదనపు చీప్ సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

## జలమండలిలో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసిన 5 మంది ఉద్యోగులు పదవీవిరమణ పొందారు. వీరిలో టెక్నికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన రవి కుమార్‌తో సహా, పలు స్థాయిల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీవిరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇడి మయాంక్ మిట్టల్, పర్సనల్ డైరక్టర్ సుదర్శన్, పిఅండ్ ఎ సిజిఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జిఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వర్గీకరణపై 'సుప్రీం'తీర్పు రాజ్యాంగబద్ధం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగబద్ధమైందని, శాస్త్రీయమైనదని అరుంధతీయ బంధు సేవా మండలి అధ్యక్షులు కెపి నర్సింగ్‌రావు అన్నారు. ఈ తీర్పు సామాజిక, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయనతోపాటు ఎంఆర్‌పిఎస్ ఇంటెలెక్చువల్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ ముత్తయ్య, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ ఆర్‌ఆర్ అధ్యక్షుడు రాయికంటి రాందాస్‌లు మీడియాతో మాట్లాడారు. మాలలు వర్గీకరణ అడ్డుకొంటే సాంఘిక ఉగ్రవాదమే అవుతుందన్నారు. 75 ఏళ్లుగా మాదిగ, దాని ఉపకులాలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, వర్గీకరణతోనే వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. సగానికిపైగా మాల సంఘాల నేతలు వర్గీకరణకు మద్దతు తెలియజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సింగిరెడ్డి పరమేశ్వర్, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.



## ఢిల్లీలో ఒబిసిల సదస్సు, ధర్నా



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** జనగణనలో కులగణన చేపట్టాలని, ఇతర సామాజిక న్యాయ సమస్యలను పరిష్కరించాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బిసిల సమరశంఖారావం పేరిట ఈనెల 11న ఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్‌లో చేపట్టే ఒబిసిల జాతీయ సదస్సు, 12న జంతర్‌మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్ లో సోషల్ జస్టిస్ పార్టీ నేతలు చామకూర రాజు, కెవిగౌడ్, హిందూ బిసి మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, రాష్ట్ర సంచారజాతుల సంఘం అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్, బిసి సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు, ఒబిసి జెఎసి చైర్మన్ అవ్వార్ వేణు ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం బిసి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# జిఒ 118తో భయపెట్టడం హేయం

### బిఎన్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ఫోరం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బిఎన్‌రెడ్డి నగర్ 118 జిఒ కాలనీల బాధితులు కొంతమంది ఐక్యవేదిక పేరుతో కాలనీ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేయడం హేయమైన చర్య అని, దీనికి తీవ్రంగా ఖండిస్తున్నామని పలు కాలనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 118జిఒ అమలును నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పునరుద్ధించాలని వారు డిమాండ్ చేశారు. 118 జిఒ కన్వేయన్స్ డీడ్ పొందిన వారికి 22ఎ (భూమి నిషేదిత చట్టం) నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మినహించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వేకెండ్ ల్యాండ్ టాక్స్‌ను ఇంటి టాక్స్ కట్టే ఇంటి యజమానులకు రాకుండా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ గౌడ్‌ని ఈ వేదిక ద్వారా బిఎన్‌రెడ్డి డివిజన్ 118 జివో సంక్షేమ సంఘం ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కొద్దిరోజుల క్రితమే కొంతమంది కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రస్తుత ప్రభుత్వ టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ని కలిసి 118 జిఒ పునరుద్ధరణ గురించి చర్చించినప్పుడు వారు ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మీద చెడు ప్రచారం చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. ప్రెస్ మీట్ పెట్టిన తరువాత నా దగ్గరికి వస్తే నేనే స్వయంగా రెవిన్యూ మినిస్టర్‌ని కలిసి మీ సమస్యలు పరిష్కారం చేస్తామని మధుయాష్కీ చెప్పడం జరిగిందని వారు గర్తు చేశారు. దీనిపై 118 జిఒ బిఎన్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ఫోరం తీవ్రంగా ఖండించారు. 118 జిఒ ద్వారా కన్వేయన్స్ డీడ్ పొందిన వారు వారి పాత ఇంటిని కూల్చివేసి జిహెచ్‌ఎంసి ద్వారా అనుమతులు పొంది ఐసిఐసిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్‌ఐసిలలో రుణాలను పొంది కొత్త ఇల్లు నిర్మిస్తున్న విషయం కాలనీ వాసులు గ్రహించాలని కోరారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి 118 జివోను పునరుద్ధరణ చేయాలని కోరుతామన్నారు. ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డిపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉన్నదని ఈవేదిక ద్వారా సంక్షేమ సంఘం నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌కెడి నగర్ కన్వీనర్ పుల్లారెడ్డి, కార్యదర్శి సుధాకర్ రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పోగుల రాంబాబు, సాగర్ కాంప్లెక్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చీమర్ల కృష్ణారెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ మాజీ అధ్యక్షులు రాజిరెడ్డి, శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ముత్యంరావు, సిబిఐ కాలనీ అధ్యక్షులు మువ్వ సతీష్ చౌదరి, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, విజయనగర్ కాలనీ అధ్యక్షులు యాదగిరి, సిద్దివినాయక హిల్స్ అధ్యక్షులు రాజు యాదవ్, సభ్యులు కృష్ణారావు, జానకి రామారావు, గోపాల్ రావు, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, నాగరాజు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో విద్య



### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి బిఏఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాగరాజు లక్ష రూపాయల చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం నిర్మిస్తున్న కళాశాల భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి పెద్ద పీఠ వేస్తున్నామని, కార్పోరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, కమ్మదనం నవీన్, లింగారెడ్డిగూడ అశోక్‌లు ఉన్నారు.

### తహసీల్దార్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

**నందిగామ:** తహశీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థలాన్ని సోమవారం పరిశీలించారు. నందిగామ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమిలో మండల రెవిన్యూ స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు యాదవ్ తోపాటు కార్యకర్తలు ఉన్నారు.

## ధరణిలో నిషేధిత భూములు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ధరణిలో ఉన్న నిషేధిత భూములను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని హాజిపల్లి గ్రామస్తులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామానికి చెందిన రైతులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధరణీ పోర్టల్‌లోని నిషేదిత అసైడ్ భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలని, బాధిత రైతులకు పట్టా పాస్ పుస్తకాలను ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు. చట్టబద్ధమైన పట్టా భూములు, క్లరికల్ తప్పుల కారణంగా నిషేదిత భూముల కేటగిరి కింద తప్పుగా గుర్తించబడ్డాయని కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిఫార్స్ లేఖను సైతం కలెక్టర్‌కు అందజేశారు. ధరణి వల్ల నష్టపోయిన భూములు చట్టబద్ధంగా రైతులకు చెందినవని, గతంలో ఎలాంటి సమస్యలు లేకుండా ఈ భూములకు పట్టా పాస్ పుస్తకాలను జారీ చేశారని గుర్తు చేశారు. క్లరికల్ పోరపాటు వల్ల ధరణి పోర్టల్‌లో నిషేధిత కేటగిరిలో పడ్డాయని, ఈ పట్టా భూములను నిషేధిత కేటగిరి నుండి తొలగించి పట్టా భూములు మార్చి పాస్ పుస్తకాలు జారీ చేసేందుకు కృషి చేయాలని హాజీపల్లి రైతుల పక్షాన సుదర్శన్ కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ అక్కడి ఉన్న షాద్‌నగర్ ఆర్‌డిఓ కవితకు ఈ విషయంపై మూడు రోజుల్లోగా నివేధిక ఇవ్వాలని అదేశించారు.

## రక్తదానంతో రోగ నిరోధకశక్తి




**ప్రజాపక్షం/సరూర్ నగర్:** రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్యానికి గురికారని, మరింత రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఫైన్ వెవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ముస్తఫా అన్నారు. కార్తీక వనభోజనాలను పురస్కరించుకొని మియాపూర్‌లోని ఆర్‌వి గెస్ట్ హౌస్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 ఏళ్ల వరకు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ప్రతి మనిషి సగటున మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. రక్తదాతలకు డాక్టర్ ముస్తఫా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధి విజయ పాల్గొన్నారు.

## పార్కు స్థలాలు కాపాడాలని వినతి

**ప్రజాపక్షం/సరూర్ నగర్:** ఆక్రమణకు గురికాకుండా పార్కు స్థలాలలో కాపాడాలని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31 డివిజన్ ఎంసిఆర్ కాలనీలోని సర్వే నంబర్ 139లో సుమారు 2000 గజాలకు పైగా పార్కు స్థలాలను కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని, ప్లాట్ నెంబర్ 73,74 తూర్పు దశలో షాడో కార్పొరేటర్ కబ్జా చేసి నాలుగు షెటర్లను వ్యాపార సముదాయం కొరకు నిర్మించారని, ఇట్టి స్థలాన్ని కూడా కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా ఎడిషన్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. అందుకుగాను అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న సబితా ఇంద్రారెడ్డి అనుచరుల ఆగడాలు కార్పొరేషన్‌లో ఆగడం లేదని విచ్చలవిడిగా పార్కు స్థలాలను, రోడ్లను సైతం వదలట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షాడో కార్పొరేటర్ పై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సతీష్ నంద, ప్రవీణ్ కుమార్ గౌడ్, పవన్ కుమార్, మల్లెల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను ఆదుకుంటా

### విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** మృతుల కుటుంబాలకు ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం ఆలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద విషయం తెలిసి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి విప్ మహేందర్‌రెడ్డి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధితులు రైతులు కావడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రితో మాట్లాడి ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు కృషిచేస్తానని మహేందర్‌రెడ్డి చెప్పారు. గాయపడిన వారికి ప్రభుత్వపరంగా ఉచిత వైద్యం అందిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఆర్‌డిఓ చంద్రకళ, తదితరులతో ప్రమాద అంశంపై మహేందర్‌రెడ్డి మాట్లాడారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సిఎం సహాయనిధి పేదలకు వరమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ బాబర్‌ఖాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ సిఎం సహాయనిధి అన్నివర్గాల ప్రజలకు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, బస్వం అప్ప, కృష్ణారెడ్డి, రఘునాయక్, కౌన్సిలర్ సర్వర్‌పాషా, పెంటయ్య, మసూద్, రవికుమార్, యాదగిరి యాదవ్, ముబారక్ అలీఖాన్, మనీష్, షార్ఫొద్దీన్, ఫయాజ్, మన్నె రవి, నీరటి వాసు, రాజమోని రాజు, రవి, జగదీష్, అనిల్ ఉన్నారు.

# మహానగరి

## నేడు ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసేకరణ గ్రామసభ

**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ లోతుకుంట గ్రామాల్లో ఏలివేటేడ్ కారిడార్ కోసం భూసేకరణ ప్రక్రియలో తమ వాణిజ్య సంస్థలు మరియు నివాస గృహాలను కోల్పోతున్న భూయజమానులు సోమవారం రోజు ఉదయం ఎనిమిది గంటలకు సిద్ధార్థ వినయ విద్యానికేతన్ ఐటిఐ కళాశాలలో జరిగే గ్రామ సభకు ప్రజలందరూ తప్పక హాజరు కాగలరని తహసిల్దార్ రాములు తెలిపారు.

## దమ్మాయిగూడలో విజయోత్సవ ర్యాలీ

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రజాపాలన విజయోత్సవల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పురపాలక కార్యాలయం నుండి పిఎస్‌రావు నగర్ కమాన్ రోడ్డు వరకు ర్యాలీని నిర్వహించారు. విజయోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు శ్రీహరిగౌడ్, ఎం వెంకటేష్, మున్సిపల్,మహిళా సంఘాలు, ఆర్‌పిలు, పాఠశాల టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్ తొలగింపుపై ఆందోళన

**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ మున్సిపల్ పరిధిలోని మచ్చ బొల్లారం డివిజన్‌లో హిందూ స్మశాన వాటికను డంపింగ్ యార్డ్‌గా ఉపయోగిస్తున్నారని, దానివలన పరిసరాల ప్రాంతాల 50కాలనీల వాసులకు దుర్గంధంతో పల్లు విష కీటకాలకు నిలయంగా మారుతుందని, కావున దానిని వెంటనే తొలగించాలని సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించే వరకు కదిలేది లేదని కాలనీవాసులు భీష్మించారు.డంపింగ్ యార్డ్ మూలం వల్ల తాము ఇండ్లను ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడిందని ప్రజావాణిలో గోడు చెప్పుకోవడానికి వస్తే డిప్యూటీ కమిషనర్ హాజరుకానందున మున్సిపల్ ఆఫీస్ ముందు నిరసన తెలుపుతూ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా జెఎసి కాలనీవాసులు ఉదయ్ ప్రకాష్, మాచర్ల శ్రీనివాస్, సుధాకర్, రాజశేఖర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, దయాసాగర్ రావు, ఢిల్లీ పరమేష్, జయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత కాపాడుకోవడం ప్రతీ పౌరుడి హక్కు



**ప్రజాపక్షం/అల్వాల్ :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా అల్వాల్ డివిజన్ జెజె నగర్‌లో జిహెచ్‌ఎంసి శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడమే కాకుండా స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవడం ప్రతి పౌరుడు హక్కు అని, స్వచ్ఛత కార్యక్రమంలో అందరూ చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ చిత్తారి, ఎస్‌ఎఫ్‌ఏలు వెంకటేష్, వెంకట్రామిరెడ్డి, విష్ణు, స్వామి, భాస్కర్, కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నాగారం:** మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి పాటుపడతానని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు రామలింగేశ్వర కాలనీలో 15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక కౌన్సిలర్ గోక కళావతితో కలసి శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పనకు కృషిచేసి మున్సిపాలిటీ అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం.. యువతకు ఉపయోగం

### గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మండల కేంద్రం లోని గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయం చైర్మన్ రాజేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. నవాబ్ పేట్ గ్రంథాలయ పర్యవేక్షకులు పర్మయ్యను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానించారు. గ్రంథాలయానికి బుక్స్, ఫర్నిచర్స్ కావాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం సమయపాలన పాటిస్తూ యువతకు ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అన్నిటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. త్వరలోనే గ్రంథాలయ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరిన విధంగా బుక్స్, ఫర్నిచర్స్ త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, గ్రామ మాజీ ఎంపిటిసి ఎగ్బాల్, సంగమేష్, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 72 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పరిష్కారానికి తీసుకొని వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి న్యాయం చేకూర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా లా అధికారి చంద్రావతి, ఇతర విభాగాల అధికారులతో కల్సి అర్జీలను స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 72 ఫిర్యాదులను స్వీకరించిన అదనపు కలెక్టర్ అర్జీలను వెంటనే పరిష్కరిస్తూ వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయటంతో పాటు వాటి వివరాలను సంబంధిత ఫిర్యాదస్తులకు తెలియ చేయాలని, పరిష్కరించ లేకపోతే దానికి కారణాలను తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం కనపరచ వద్దని సూచించారు.

## అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### మార్కెట్ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/బంట్వారం:** బంట్వారం మండల కేంద్రంలో మర్పల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు మహేందర్ రెడ్డి సోమవారం విలేకర్ల సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి హజరయ్యారు. సందర్భంగా అభివృద్ధి అనేది కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, జిల్లాలోనే అత్యంత వేనుకబడిన బంట్వారం మండలం అభివృద్ధి కోసం మార్కెట్ కమిటి అధ్యక్షులు మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ హయాంలో మండలానికి గోదాం మరియు మేకల సంతను ఏర్పాటుకు కృషి చేశారన్నారు. సంక్రాంతి పండగ తర్వత రైతు భరోసాను కూడా రైతుల ఖాతలో నగదును వేయడం జరుగుతుందని తెలిపారు. మండలం కోనసాగాల్సిన ప్రభుత్వ గుకరుకుల పాఠశాల ఎక్కడో తోలకట్ట లో కోనసాగుతుందని మండల నాయకుల మర్పల్లి మార్కట్ కమిటి అధ్యక్షులు మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా అట్టి పాఠశాలను బంట్వారం మండలంలో స్థలాన్ని పరిశీలించి ఇక్కడికి తరలించేదుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేంకటేశం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వేంకటయ్య, మర్పల్లి మార్కెట్ కమిటి సభ్యులు యాదగిరి, నర్సిములు, హరీశ్వర్ రెడ్డి, సినియర్ నాయకులు మొగులయ్య, మాజీ సర్పంచు నర్సిములు, నాయకులు, తదితరులు ఉన్నారు.

### బోడుప్పల్, ఫీర్జాదిగూడ జంట కార్పొరేషన్‌లో

# హైడ్రా అధికారుల పర్యటన



### పలు ఫిర్యాదుల పరిశీలన

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** చెరువుల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా మరోసారి దృష్టి పెట్టింది. తక్షణమే వాటిని తొలగించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మేరకు మేడిపల్లి మండల పరిధిలోని పరిధిలోని ఫీర్జాదిగూడ, బోడుప్పల్ జంట కార్పొరేషన్ లలో కబ్జాలపై పలు ఫిర్యాదులు రావడంతో హైడ్రా అధికారి అడిషనల్ కలెక్టర్ సుధా ఆధ్వర్యంలో స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు పట్టుకుంది. బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచర్ల చింతల చెరువు వద్ద సర్వే నంబర్ 57 కొత్త కిషోర్ గౌడ్, కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్‌లు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చేసిన ఫిర్యాదుపై చింతల చెరు వు పరిసరాలను, బఫర్ జోన్‌లను వారు పరిశీలించారు. కొత్త నిర్మాణాలు పెద్దగా ఉండటంతోపాటు, నిర్మాణం లో ఉన్న కట్టడాల ఫొటోలను తీసుకున్నారు. అనంతరం ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సర్వే నంబర్ 1లో ముస్లీం, క్రిస్టియన్ శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురి అయ్యిందని చార్లెస్, మదార్‌లు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులతో పర్యటించి వివరాలు సేకరించారు. వారిలో హైడ్రా తహసీల్దార్ హేమ, ఎఇ విజయకుమార్, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, ఫీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ రఘు, బోడుప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ ఎఇ పరమేష్, ఆర్‌ఐలు రాకేష్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

**రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కూల్చివేతలు:** ప్రభుత్వ స్థలం కనిపిస్తే కబ్జాదారులు రెచ్చిపోయి కబ్జాల కు పాల్పడుతున్నారని, భూములకు ధరలు పెరగడంతో అక్రమదారుల చూపు ప్రభుత్వ భూము ల వైపు కబ్జాదారుల చూపు మళ్లిందని, తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని కొల్లగొట్టడానికి కొందరు దళారులు చూస్తున్నారని పలుమార్లు హెచ్చరించిన వినకపోవడంతో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించామని మేడిపల్లి తహసీల్దార్ హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు.



సోమవారం మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నెంబర్ 63/1 నుండి63/25 లో ఎస్సీల కోసం కొరకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని సమాచారం రావడంతో మేడిపల్లి తహసీల్దారు ఆదేశాల మేరకు రెవి న్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ పర్యవేక్షణలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఇండ్లు, 2 బిస్మెంట్లు అక్రమ నిర్మాణాలను జెసిబితో కూల్చి వేశారు. నిర్మాణ దారులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గతంలో కూల్చివేతలు చేయడానికి రెవిన్యూ సిబ్బంది వస్తే కబ్జాదారులు రెచ్చిపోయి దాడులకు దిగుతున్నారని, కొందరూ రాష్ట్ర నాయకుల పేరును వాడుతూ కూల్చివేతలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. దళారులను నమ్మి ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనవద్దని తెలిపారు. కూల్చివేతలో రెవిన్యూ సిబ్బంది కుమార్, జానకి రామ్ పాల్గొన్నారు.

## అనుమతిలేని భవనంపై చర్యలు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధి బౌరంపేట్ గ్రామంలో 166 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో 166/22 క్రియేట్ చేసి ఎన్‌ఓసి కూడా లేకుండా కాలేజీకి గాని, బిల్డింగ్‌కు గాని హెచ్‌ఎండిఎ, మున్సిపల్ నుండి ఎలాం టి అనుమతులు లేకుం డా రెండెకరాల స్థలంలో బహుళ అంతస్తు అక్రమ నిర్మాణం చేపట్టారని గత మూడు నెలల క్రిత మే పర్మిషన్ లేని బిల్డింగ్ నిర్మిస్తున్నారని ఎన్‌ఓసి, పర్మిషన్ లేవని తెలిసింది. ఉంటే పర్మిషన్ యొక్క వివరాలు తెలియజేయగలరని సమాచార హక్కు చట్టం కింద దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌ను కోరగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండ దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని, ఎన్‌ఓసి మరియు పర్మిషన్‌లేని భూమిలో నిర్మించిన కాలెజీపైన చర్యలు తీసుకోవాలని దుండిగల్ ఎమ్మార్వో సయ్యద్ మతిన్‌కు వినతిపత్రం అందజేశారు. సామాన్య రైతులు గత 70సంవత్సరాల నుండి మూడు తరలు గా దున్నుకొని జీవిస్తున్న 166 సర్వే నెంబర్ లావణ్య పట్టా భూములు రైతులకు దక్కడం లేదని ఇంతవరకు ధరణిలో ఎక్కలేదని రైతు బంధు దిక్కు లేదు, రైతులను ఒక్కొక్కరుగా ఖాళీ చేయించడం జరిగిం దని, ఒక చిన్న షెడ్డు వేసు కుంటే కూల్చివేసే అధికారులు బడా బిల్డర్లకు, కార్పొరేట్ విద్యా సంస్థలకు, కొందరు నాయకులకు ఎలాంటి ఎన్‌ఓసి లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని దీనిపై ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి ప్రజా ఆస్తులను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ బిజెపి నాయకులు పీసరి కృష్ణారెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, నల్ల రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ ఏడాది వేడుకల్లో పాటలతో కళాయాత్ర

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా జిల్లాలో కొనసాగునతున్న ప్రజా పాలనప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం కళాయాత్ర జరిగింది. తెలంగాణా సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలు జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం, నందనగర్, కాప్రా మండలంలోని జవహర్‌నగర్, కాప్రా, చర్లపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ ఉష, గ్రామ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.






## ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక కోర్సులతో కూడిన విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తోందని, ఈ అవకాశాలను వినియోగించుకొంటూ యువతీయువకులు తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు అన్నారు. ఇసిఐఎల్ చౌరాస్తాలోని జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో పాటు ఈ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సులైన డిప్లొమా ఇన్ ఇసిజి టెక్నాలజి, డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మరియు ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ కోర్సులను సైతం అధికారికంగా ప్రారంభించారు. మరోపక్క మల్కాజిగిరిలోని ప్రభుత్వ బోధనాస్పత్రిలో వారానికి రెండురోజుల పాటు వైద్య సేవలందించే విధంగా ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా మైత్రీ క్లినిక్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, డిఎంహెచ్‌ఓ రఘునాథస్వామి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ డి.జయంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతం మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకొని వచ్చిందన్నారు.

## ఏడాదైనా ఏమీ చేయలేని ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి

### కాంగ్రెస్ నేతల ఆక్షేపణ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఎమ్మెల్యేగా ఏడాది పూర్తి చేసుకొంటున్న మర్రి రాజశేఖరరెడ్డి నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేని నాయకుడిగా తయారయ్యాడని నియోజకవర్గ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఆక్షేపణ వ్యక్తం చేసారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, పార్టీ నేతలు వెంకటేష్ యాదవ్, జితేంద్ర నాథ్, జివిఎన్ సతీష్‌కుమార్, బికె శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, ఎస్ఆర్‌ప్రసాద్, బాబు, సత్యనారాయణ, సయ్యద్ మబ్బు, ఫరీద్, సంపత్ గౌడ వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, ఇందిరా ప్రియదర్శిని, ఆశ, చెన్నారెడ్డి, చంద్రకాంత్, కన్న, సిరిగ గిరిరాజు, బాలరాజు యాదవ్, ఆగమయ్య, వెంకటేశ్వరరావు, ఫారూఖ్, మంద భాస్కర్, చందు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా, పత్రికా ప్రకటనలతో ప్రచార ఆర్భాటాలు తప్ప ఇప్పటివరకు ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమానికైనా ఎమ్మెల్యే ఏ ప్రాంతానికీ నిధులు మంజూరు చేయలేక పోయాడన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో కార్పొరేటర్ స్థాయిలో జరిగే సాధారణ పనులకు శంకుస్థాపనలు చేయటం, గతంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హయాంలో నిధులు మంజూరై పూర్తయిన పనులు తానే చేసినట్లు చెప్పుకొంటున్నాడని విమర్శించారు. ఏడాదిగా తాను సాధించిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని వారు ఎమ్మెల్యేని డిమాండ్ చేసారు.




## గౌతంనగర్ డివిజన్ సమస్యలు పరిష్కరించాలి : కార్పొరేటర్ సునీత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్ పరిధి ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉంటున్న సమస్యలు పరిష్కరించటంలో పెండింగ్‌లో ఉన్న పనులకు అనుమతులిస్తూ నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ సునీతా రాము యాదవ్ కోరారు. సోమవారం జిహెచ్‌ఎంసి జోనల్ కమిషన్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డితో కల్సి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ నుండి జెటిసి చౌరాస్తా మీదుగా రెండు బాక్స్ డ్రైవ్‌లు నిర్మించాలని, దీని వల్ల వరదనీరు ఇళ్లల్లోకి చేరదన్నారు. అదేవిధంగా గల్ఫ్ లింక్ కాలనీ, స్వర్ణాంధ్ర కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజి సమస్య పరిష్కరించాలని కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమనికి అధికారులు తప్పనిసరిగా హజరుకావాలని ,ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను అదేశించారు. సోమవారం ప్రజావాణికి 128 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న క్రమంలో ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తిచేసేందుకు కృషి చేయాలని అన్నారు. ముందుగా పర్మిషన్ తీసుకోకుండా గురుకల స్కూల్ కళాశాలలో ప్రవేశించడం జరిగితే సోసైటి రూల్స్ కు విరుద్ధమని ,కాబట్టి ఎవ్వరిని కూడా అనుమతించారాదని హెచ్చరించారు. వసతి గృహ లలో ఎలాంటి లోపలు లేకుండా అధికారులు చూసుకోవాలని తెలిపారు. సిఎం కప్ క్రీడలను డిసెంబర్ 7వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించలని అన్నారు. 21న జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించాలని అన్నారు.మండల ప్రత్యేక అదికారలు అన్ని అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , సుధీర్ , ట్రైని కలెక్టర్ ఉమా హరతి ఆర్‌డిఓ వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

**సకాలంలో స్కాలర్షిప్ అందచేయాలి**

లెక్టర్ కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ, వివిధ కళాశాల ప్రిన్సిపల్, యజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోస్టు మేట్రిక్ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసుకునే క్రమంలో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని తప్పులను సరి చేసుకునేందుకు వీలుగా ఆధార్ కిట్లను సమకుర్చకోవాలన్నారు. విద్యార్థుల గ్యాప్ సర్టిఫికేట్ నిమిత్తం కళాశాల ప్రిన్సిపాల్స్ యాజమాన్యాలను డిఎస్‌డివోకు విద్యార్థుల జాబితాను సమర్పించాలని తెలిపారు. ఇపాస్ పోర్టల్ స్కాలర్ షిప్ నిమిత్తం రిజిస్టర్ చేసుకున్నట్లయితే స్కాలర్ షిప్ నిమిత్తం రిజిస్టర్ చేసుకున్నట్టయితే స్కాలర్ షిప్ త్వరలో మంజురు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హరతి, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి మల్లెశం, డిటిపిఓ కమలాకర్ రెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ ,తదితరులు పాల్గోన్నారు.



## గురుకుల అభివృద్ధికి కృషి

### టిజి మహిళా సహకార కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి

**ప్రజాపక్షం/నాగారం:** గురుకులాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. సోమవారం నాగారం మైనారిటీ గురుకుల పాఠశాలను శోభారాణి, టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ సందర్శించి తనిఖీ నిర్వహించి విద్యార్థులకు అందుతున్న వసతుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అన్నంరాజు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలు

### తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** రాష్ట్రంలో రాక్షస పాలన అంతమైందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు శ్రీకారం చుట్టారని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి సంవత్సర కాలం పూర్తి కావస్తున్నా సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవలలో భాగంగా సోమవారం తాండూరు మండలంలో పర్యాటించిన ఎంఎల్ఎ పలు అభివృద్ధి పనులను శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు గావించారు. తాండూరు మండల పరిధిలోని ఓగిపూర్, కరణ్‌కోట్, బెల్కాటూర్,గౌతాపూర్, చెంగోల్, చింతామణి పట్నం, పర్వాతాపూర్, చెనిగేష్‌పూర్ తదితర గ్రామాలలో పర్యాటించిన ఎంఎల్ఎ మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం మంజూరైన రూ.2.75కోట్ల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం పనులను శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎంఎల్ఎ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల రుణమాఫి , సన్న వడ్లకు రూ.500ల బోనస్ ఇచ్చి ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులను తమ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.400కోట్ల నిధులు రోడ్ల నిర్మాణానికి వినియోగించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో మహిళ సంఘాలకు పూర్వ వైభవం తీసుకవచ్చి వడ్డి లేని రుణాలను అందజేస్తుందన్నారు. ఏడాది పాలనలో తమ ప్రభుత్వం నిరుద్యోగులకు 50వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. బషీరాబాద్ మండలం నుండి కరణ్‌కోట్ వరకు రోడ్డు పనులకు లైన్ క్లీయర్ అయిందని భూ నిర్వాసితుకు పరిహారం చెల్లిస్తామని హమిచ్చారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏంతో మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవిగౌడ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉత్తమ్‌చంద్, రాజు కుమార్, మండల పార్టీ అధ్యక్షులు నాగప్ప, డైరక్టర్ జర్నప్ప తదితరులు పాల్గోన్నారు.

